
# డూ...డూ...బసవన్న



— అయ్యగారి శ్రీనివాసరావు

కూతురి వరస చూస్తే ఏదో అనుమానంగా ఉంది మంగయ్యకి. ఆ అనుమానం మరింత బలపడి బెంగగా మారింది ఇందాక గదిలో కూతుర్నలా చూసే సరికి. అనుమానమైతే కలిగింది గాని ఆ విషయం కూతుర్ని ఎలా అడగగలడు? కొడుకయితే ఎలాగోలా అడిగేవాడేమో! పోనీ భార్య చేత అడిగిద్దామంటే అదో మాలోకం. ఒకటంటే ఒకటడుగుతుంది. ఇలా ఆలోచిస్తున్న మంగయ్యకి ఏదో గుర్తొచ్చిన వాడిలా లేచినిలబడ్డాడు. కూతురున్న గది కిటికీలోంచి చూశాడు. ఆమె ఉన్న స్థితిని చూసి మతిపోయిందతడికి. అద్దానికి ముందు నిలబడి రకరకాల పోజిషన్లలో తన మూఖాన్ని చూసుకుంటోంది. నవ్వుకుం

టోంది. సిగ్గుపడుతోంది. ఇంకేవేవో పన్నెలు, చిన్నెలు చేస్తోంది. వాటన్నింటికీ అర్థం తెలియదు మంగయ్యకు. కానీ ఒక్కటి మాత్రం పూర్తిగా అర్థమైంది. అమ్మాయి పెళ్లికి తొందరపడుతోందని మాత్రం అతడికి పూర్తిగా అర్థమైంది. అంతే కాదు. ఆమె మనసులో ఎవరికో చోటిచ్చిందని కూడా అర్థం చేసుకున్నాడు.

మంగయ్య అమాయకుడేం కాదు. చాలా తెలివైన వాడనే చెప్పాలి. కాకపోతే ఎప్పుడో కూతురు కామాక్షి చిన్నతనంలో తన పల్లెనుంచి పదణాల డబ్బులతో ఈ ఊరు చేరిన వాడు ఈనాడు పది లక్షలకధిపతి ఎలా అవుతాడు? పట్టుకొచ్చిన పదణాలే పెట్టుబడిగా పెట్టిపిండి వడియాలు అమ్మాడు. రూపాయి చేశాడు. ఆ రూపాయి పెట్టుబడిగా పెట్టి జంతికలు, చేగోడీలు చేసి తన ఇంట్లో సత్తుపళ్లెంలోనే పెట్టి అమ్మి రెండు రూపాయలు లాభం సంపాదించాడు. దానితో జంగిడికొని చేగోడీలు జంతికలకు తోడు పాలకాయలు, కజ్జివుండలు, పుణుకులు, గారెలు వగైరా అమ్మాడు. కాగితాలతో కవర్లు చేసి అమ్మాడు. చిన్న చిన్న తినుబండారాలమ్మాడు. రూపాయికి రూపాయి చిగిర్చి వందలుగా మారాయి. వందలు కొమ్మలేసి వేలయ్యాయి. వ్యాపారం పెరిగింది. లాభం పెరిగింది. దాంతో బాటు ముఖ్యంగా జాగ్రత్త పెరిగింది. పైసా అంటే ఎంతవిలువైందో తెలిసిన వాడు కాబట్టి డబ్బు అనవసరంగా ఖర్చు పెట్టడమంటే గిట్టదు. అవసరమై వందఖర్చు పెట్టవలసి వచ్చినా ఒకటో రెండో మిగిల్చితేగాని తృప్తి ఉండదతడికి.

అలాటి మంగయ్య బయటికి మాత్రం చూడడానికి వెర్రిబాగుల వాడిలా కనబడతాడు. కావాలనే అలా ఉంటాడనుకోండి అదివేరే విషయం. వేషం చూస్తే ఇతడి దగ్గర పూట గడవటానికి నూకలైనా ఉన్నాయా అనిపిస్తుంది. కానీ అతడి బుర్రలో మాత్రం వేలవేల ఆలోచనలున్నాయి. అందులో భాగంగానే కూతురికి పెళ్లి వయసొచ్చిందనే ఆలోచన కొన్ని సంవత్సరాల క్రితమే వచ్చింది. కానీ ఆడపిల్ల పెళ్లంటే మాటలా? అందుకే ఆ ఆలోచన రానివాడిలానే ఊరుకున్నాడు.

కూతురు కామాక్షి కూడా జాగ్రత్త పరురాలే. తండ్రిమీద రెండాకులెక్కువే చదివింది. ఇలా అంటే తప్పేమో కదా? రెండణాలు ఎక్కువే సంపాదిస్తుంది. తండ్రి కాణీ దాచాలని చూస్తే కూతురు పరకదాచడానికి ప్రయత్నం చేస్తుంది. ఈ కాణీలు, పరకలు, అణాలు పాతకాలాని కాబట్టి కామాక్షి కూడా పాతకాలం మనిషనుకునేరు. అలా అంటే పొరపాటేనండోయ్. అందుకే చెబుతున్నా నూటికి నూరు శాతం (పదాహారణాలనలేదుమరి) ఆధునిక కాలానికి చెందింది.



'సర్వర్ ! ఏంటి గొడవ?' అడిగాడు హోటల్ మేనేజర్.
'చూడండి సార్ ! 'వన్ బై టు' కాఫీ తాగి సపరేట్ బిల్లు ఇవ్వమని గొడవ చేస్తున్నారు' అన్నాడు సర్వర్.

బి. చంద్రశేఖరయ్య
రామసముద్రం

ఆమెకు కొట్లో రేట్లు, బజారులో రేట్లతో బాటు పెళ్లిళ్ళ మార్కెట్లో పెళ్లి కొడుకుల రేట్లు కూడా తెలుసు. అందుకే తండ్రి తనకి పెళ్లి ప్రయత్నాలు చేయకపోయినా నోరెత్తలేదు.

అలాగని తండ్రి తన ప్రయత్నం మానడని కామాక్షికి తెలుసు. కూతురికి పెళ్ళి చెయ్యాలనీ మంగయ్యకి తెలుసు. కాకపోతే ఇద్దరూ ఎదురు చూసేది చవకగా కుదిరే పెళ్లి కొడుకు గురించే. అలాంటి వాడు దొరికే వరకూ కూతురు ఏ రకమైన తొందరా పడదనే నమ్మకం మంగయ్యకుంది. కానీ అది కొన్ని క్షణాల క్రితం వరకే. కానీ ఇప్పుడా నమ్మకం పోయింది. అలా ఆలోచిస్తూన్న మంగయ్యకి అప్పుడనిపించింది.

ఎంతైనా వయసుపైబడిన ఆడపిల్ల. ఆమెకీ ముచ్చట్లుంటాయి కదా! అందుకే ఆమెలో ఈ మార్పు అనిపించింది. అంతలోనే కర్తవ్యం గుర్తొచ్చింది. ఆమె ముచ్చట పెడమార్గంలో తీర్చుకోకముందే తనే తీర్చాలని అందుకే కూతురిని పిలిచాడు. రెండుమూడుసార్లు పిలిచాక వచ్చింది. ఆమె అవతారం చూసి ఏమి మాట్లాడాలో తెలియలేదు మంగయ్యకి కానీ అతడికా శ్రమలేకుండానే కామాక్షి అంది.

ఎందుకు నాన్నా పిలిచారు? అని.

దానికతడు ఏ సమాధానం చెప్పేటంతలో కూతురే అంది.

"నాన్నా...." అని.

"ఏమిటమ్మా...." అడిగాడు మంగయ్య.

కామాక్షి నుంచి సమాధానంలేదు. అది చూసిన మంగయ్యకి కూతురేదో చెప్పాలని చెప్పలేకపోతోందని అర్థమైంది.

కామాక్షికి కూడా తండ్రి ఏదో అడగాలని అడగలేకపోతున్నాడని అర్థమైంది. కానీ ఆ విషయానికంత ప్రాధాన్యతనివ్వలేదు. ఆమె మనసులోని మాట ఎలా చెప్పడమా? అనే ఆత్రుత ఉందామెలో.

అది కనిపెట్టిన మంగయ్య తెలివిగా ప్రవర్తించాడు. తాను చెప్పదలచుకున్న విషయాన్ని దాచి

"ఏంటమ్మా? ఏదో చెప్పాలనుకుంటున్నావ్. ఏంటది?" అడిగాడు.

ఆ మాటవిన్న కామాక్షికి తన మనసులో మాట చెప్పే అవకాశం వచ్చినందుకు సంతోషించింది. కానీ తొందరపడకుండా మౌనంగానే ఉంది. అది కనిపెట్టిన మంగయ్య.

"ఏంటమ్మా... చెప్పు... భయం లేదు" అన్నాడు అనునయంగా మంగయ్య. దాంతో చెప్పడం మొదలు పెట్టింది.

"నాన్నా.... నేను... ఆఁ.....చిట్టెయ్యని.... చేసుకుంటాను నాన్నా!" అంది. తలదించుకుని సిగ్గుపడుతూ. అది విన్న మంగయ్యకి ఆశ్చర్యం కలగలేదు. ఎందుకంటే అలాటిదేదో ఉందని ముందే ఊహించాడు కాబట్టి కాకపోతే ఇంత తెలివైన కూతురు అలాంటివాణ్ణి కోరుకుందేమిటా అని మాత్రం అనిపించింది. ఒక్క క్షణం బాధ పడ్డాడు కూడా. ఎందుకంటే ఆ చిట్టెయ్య సంగతి తెలిసిన వాడు కాబట్టి.

చిట్టెయ్య తన కులంలోనే పుట్టినా పేదవాడు కాబట్టి అక్కడా ఇక్కడా పెరిగాడు. తండ్రిలేకపోవడంతో చిన్నవయస్సులోనే బాధ్యత నెత్తినపడింది. అందుకే బతుకుతెరువు కోసం ఆ కొట్లోనూ ఈ కొట్లోనూ పనిచేసి తల్లిని పోషించాడు. వాళ్లిద్దరే ఆ ఇంట్లో వాళ్లు కాబట్టి ఎంతిస్తే అంత సరిపోయేది. కాదుసరిపెట్టుకున్నారు. తల్లి బొత్తిగా అమాయకురాలు కాబట్టి ఆమె శిక్షణలో పెరిగిన చిట్టెయ్య కూడా అలాగే తయారయ్యాడు. ఆ అమాయకత్వమే అతణ్ని ఎక్కడా తిన్నగా పనిచెయ్యనివ్వలేదు. కాకపోతే అందరూ జాలిపడడం తప్ప ఏమీ చెయ్యలేకపోయారు. ఏదో బాధలు పడి ఈమధ్యనే చిన్నవ్యాపారం మాత్రం మొదలుపెట్టాడు. ఎవరు మదుపు పెట్టారో, తనే దాచుకున్నాడో ఎవరికీ తెలియదు. ఎందుకంటే అతణ్ణి పెద్దగా పట్టించుకోలేదెవరూ. ఆ చిట్టెయ్య చిన్న తనంలో ఓ కొన్నాళ్లు తన కొట్లో రోజుకు పావలా జీతానికి పని చేశాడు. అలాంటి చిట్టెయ్యని కూతురు చేసుకుంటానంటే ఏమనడానికీ తోచలేదు. అయినా నోరుపెగుల్చుకుని.

"అమ్మా! అలాటి వాణ్ణి చేసుకోవడమేమిటి? నీ తండ్రి నీ పెళ్లి చెయ్యలేడనా నీ భయం" అన్నాడు.

ఆ మాటవిన్న కామాక్షి "అదికాదు నాన్నా! అలాటివాణ్ణి చేసుకుంటే నా చెప్పుచేతల్లో

ఉంటాడు. కట్నం కూడా ఇవ్వక్కర్లేదు. అదీ కాక అతను నామాటకి ఎంతో విలువనిస్తాడని తెలిసింది. ఏ ఆడదైనా అలాంటి భర్తనే కదా కోరుకుంటుంది. అతడు అమాయకుడైతే నేం, నేను చెప్పినట్టు వింటే అతణ్ణి అభివృద్ధి చేసుకోగలననే నమ్మకం నాకుంది" అంది. అది విన్న మంగయ్యకి కూతురి చాకచక్యం మీద నమ్మకం ఉన్నా చిట్టెయ్య తన కూతురి మాటెలావింటాడో అర్థం కాలేదు. అందుకే.

ఇంతకీ అతడు నీవు చెప్పిన మాటవింటాడని గ్యారంటీ ఏమిటి? అన్నాడు ఆసక్తిగా. దాంతో ఉత్సాహం వచ్చిన కామాక్షి చెప్పడం మొదలు పెట్టింది.

* *

ఈ మధ్యే కొత్తగా బట్టల కొట్టు తెరిచాడు చిట్టెయ్య ఒకచోట. ఏదో కావలసి వచ్చి ఆ కొట్టు కెళ్లింది కామాక్షి. తన పనైపోయి తిరిగి రాబోతూంటే అక్కడ పెట్టిన బోర్డు చూసింది. బేరం లేక ఖాళీగా ఉన్నాడు చిట్టెయ్య. కాబట్టి ఆ బోర్డుని చూసి చిన్ననాటి స్నేహితుడైన అతణ్ణి ఆటపట్టించాలనిపించి లోపలికెళ్లింది.

చూడు చిట్టెయ్యా! ఏంటీ ఈ బోర్డు ఇలా రాయించావు. "ఇచ్చట బట్టలు అమ్మబడును" అని రాయిస్తారా ఎవరైనా! ఇలా అయితే నువ్వు పొదుపు చెయ్యలేవు. పొదుపు డబ్బు విషయంలోనే కాదు. అన్నింట్లోనూ పాటించాలి. బట్టలు ఇక్కడ కాకపోతే మరెక్కడమ్ముతారు? అందుకే "ఇచ్చట" అన్నది తీసేసి "బట్టలు అమ్మబడును" అని రాయిస్తే చాలు. తెలిసిందా. ఆ చోటు మరిదేనికైనా పనికొస్తుందికదా?" అంది. ఆ మాటకి ఏమనుకున్నాడో గాని అలాగేనని తలాడించాడు.

ఆ మర్నాడు అటువెళ్లిన కామాక్షికి ఆ బోర్డులో "ఇచ్చట" అన్న పదం చెరిపేసి కనిపించింది. ఆశ్చర్యపోయింది. అంతకుమించి అతడి అమాయకత్వానికి నవ్వొకుంది కాస్సేపు. అప్పుడే మరొక ఆలోచన వచ్చింది. వెంటనే చిట్టెయ్య దగ్గర కెళ్లింది.

చిట్టెయ్యా! నీకేమైనా మతిఉందా? బట్టలు కాకపోతే ఈ కొట్లో చెప్పులమ్ముతారా? చూసిన వాళ్లకిది బట్టలకొట్టు అని తెలీదా? ఆ మాత్రం దానికి " బట్టలు అమ్మబడును" అని రాయాలా? "అమ్మబడును" అని రాస్తే చాలదటోయ్. నా మాటవిని ఆ "బట్టలు" అన్న పదం చెరిపేయించెయ్యి నీకు పొదుపెప్పుడొస్తుందో అని గుమ్మం దిగిపోయింది.

తన మాట కార్యరూపం దాల్చిందో లేదోనని పనికట్టుకుని వెళ్లిన కామాక్షి ఆ బోర్డు చూసే సరికి "బట్టలు" అన్న పదం నిజంగానే మాయమైంది మర్నాడు.

అది చూసిన కామాక్షికి కించిత్ ఆశ్చర్యం పెరిగింది. ఇంకా వదిలి పెట్టదలుచుకోలేదు. అందుకే మళ్లీ లోనకెళ్లింది.



భార్య : ఏమండీ ! నాకు నెక్లెస్ చేయించరూ ?
భర్త : నీ ఒంటి ఛాయ బంగారం —నీ మనసు బంగారం —నీ కెందుకే బంగారం ?

బి. చంద్రశేఖరయ్య
రామసముద్రం

"బాగుందయ్యా చిట్టెయ్యా! కొట్టు ఎందుకు పెడతారు?" అడిగింది సీరియస్‌గా.

ఆ మాటకి అమాయకంగా "అమ్మడానికి" అని సమాధానం ఇచ్చాడు చిట్టెయ్య. అది విన్న కామాక్షి.

'ఔను కదా! అందరికీ తెలిసిన విషయమే కదా? మరి అలాంటిదానికి "అమ్మబడును" అని బోర్డెందుకు చెప్పు. దుకాణం చూస్తేనే ఇక్కడ అమ్ముతారు" అని అందరికీ తెలుస్తుంది కదా. అసలా అమ్మబడును అన్న బోర్డు తీస్తే నీకు పొదుపు నేర్పలేక ఛస్తున్నాననుకో అంది వచ్చే నవ్వునాపుకుంటూ. చిట్టెయ్య మాత్రం కామాక్షికి గంగిరెద్దు గుర్తొచ్చేలా చేశాడు.

ఆ మర్నాడు పనిగట్టుకుని అక్కడి కెళ్లే సరికి చిట్టెయ్య బట్టలకొట్టు మాత్రమే ఉందక్కడ బోర్డు మాత్రం లేదు. అప్పుడొచ్చింది ఆమెకాలోచన. ఇలాంటి వాణ్ణి చేసుకుంటే చెప్పినట్టల్లా వింటాడు. తనెలాగూ తెలివైనదంటారందరూ? కాబట్టి తన తెలివితేటలతో భర్తని చెప్పుచేతల్లో ఉంచుకొని వ్యాపారం బాగుచేయ్యొచ్చు. పైగా కట్నం కూడా అడగడు. ఆ ఆలోచన రాగానే సిగ్గుముంచుకొచ్చింది. తండ్రి కెలాచెప్పాలా అని సతమతమవుతోంది. అతడి ఆలోచనలు మాత్రం తననివిడిచిపెట్టటంలేదు. పెళ్లనగానే ప్రేమ ఊసుమదిలోకి రాగానే ఇంత మధురంగా ఉంటుందని అప్పుడే తెలిసిందామెకి.

* *

ఆ మాట విన్న మంగయ్య ఆలోచించాడు. అమాయకుడు తల్లి తప్పమరెవరూ లేనివాడు కాబట్టి కట్నం బాధలేదు. ఊరిలో సంబంధం. పిల్లవాడు అందగాడే పైగా కూతురు ఇష్టపడుతోంది. వ్యాపారం మొదలెట్టాడు కాబట్టి తన కూతురు దాన్ని అభివృద్ధి చేయగలదు. అందుకే చిట్టెయ్య తల్లితో మాట్లాడి పెళ్లి జరిపించేశాడు. అత్తవారింటికెళ్లి పోయింది కామాక్షి.

* *

వెళ్లిన వారం రోజులకే ఒక్కర్తీ తిరిగొచ్చిన కూతురిని చూసి కారణం అడిగాడు మంగయ్య. ఆ మాటకి అంత వరకూ ఉగ్గబట్టుకున్న కామాక్షి ఒక్కసారిగా బావురుమంది. ఆమెనోదార్చి నెమ్మదిగా విషయమడిగాడు. ,ఆ మాటలకి కామాక్షి.

"నాన్నా! అతడు అమాయకుడు కాబట్టి నా మాటవింటాడని సరదాపడ్డాను. కానీ మోసపోయాను నాన్నా" అంది వెక్కుతూ. అది విన్న మంగయ్య.

ఏమ్మా! నువ్వు చెప్పినట్టు వినటంలేదా? అన్నాడు అనుమానంగా.

అది కాదు నాన్నా! అతడు నేను చెప్పిన మాటలే విన్నాడని మురిసిపోయాను. కానీ అది అతడి వీక్నెస్ అని కనిపెట్టలేకపోయాను అంది.

ఆమె చెబుతున్నదేంటో అర్థంకాక వివరంగా చెప్పమన్నాడు. దానికి ఆమె వివరిస్తూ.

"అతడు నేను చెప్పిందే కాదు. ఎవరేది చెప్పినా వినేసివెంటనే ఆ పనిచేసేస్తాడు నాన్నా. మొన్న ఎవరో కష్టమర్ వస్తే పట్టుచీర చూపించారట. ఆ కష్టమర్ ఇది పట్టు చీరకాదు. నిన్నెవరో మోసం చేసి దీన్ని అంటగట్టారు అనే సరికి తక్కువ ధరకే ఇచ్చేశారట" అంది. అది విన్న మంగయ్య.

పోనీ ఇక ముందు అలాంటివి రాకుండా చూసుకో. ఆ మాత్రం తెలివిలేదా? అన్నాడు.

అది విన్న కామాక్షి నేను చూసుకోవడానికి నన్ను ఇంట్లో ఉండనిస్తే కదా? అంది. ఆ మాటకి గతుక్కుమన్న మంగయ్య వివరమడిగాడు. దానికి కామాక్షి.

నిన్నెవరో స్నేహితుడు వచ్చి అదేంట్రా అలాంటి పిల్లని చేసుకున్నావు. నేనైతే అసలు చేసుకోను. ఒక వేళ పెద్దవాళ్లు బలవంతం మీద చేస్తే ఈ పాటికి వదిలేద్దును. నువ్వు సత్తెకాలం వాడివి కాబట్టి నిన్ను మోసం చేసి అంటగట్టారు కానీ నీకేంటి లోటు "అని పొగిడేసరికి అతడి మాటలు పట్టుకుని నన్ను వదిలేస్తానని గొడవ మొదలెట్టి ఎంత చెప్పినా వినకుండా పుట్టించికెళ్లిపోమని పంపించివేశారు" అంది ఏడుస్తూ.

ఆ మాటకి ఖంగుతిన్నాడు మంగయ్య. అంతలోనే ఆ అమాయక చక్రవర్తిని బుట్టలోవేసి ఎలా తన కూతురి కాపురం నిలబెట్టాలా అనే ఆలోచనో పడ్డాడు. ఆ ఆలోచనల్లో కూతురు కామాక్షి ముందే పడిందని మంగయ్యకి తెలియదు.

*